బెంగాలీ కథ - శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ

# లాలూ

అనువాదం : నందవరం కేశవరెడ్డి

**అ**తని ముద్దుపేరు లాలూ. అసలు పేరంటూ ఉంది కానీ ఇప్పుడు జ్ఞాపకం రావటంలేదు. బహుశా మీకు తెలిసే ఉంటుంది.. 'లాల్' అంటే హిందీలో 'అభిమాని' అని. ఆ పేరు ఎవరు పెట్టారో ఏమో కానీ, అతను ఆ పేరుకు తగిన వ్యక్తే. అతను అందరి అభిమాని.

స్కూలు తర్వాత మేం కాలేజీలో చేరాం. లాలూ చెప్పాడు.. వ్యాపారం చేస్తానని. వాళ్ళ అమ్మ నుండి పది రూపాయలు తీసుకున్నాడు, కాంట్రాక్టు పని ప్రారంభించాడు. "లాలూ! నీ పెట్టుబడి పది రూపాయలు మాత్రమే" మేం అన్నాం.

"ఇంతకంటే ఎక్కువ నాకెందుకు? ఇది చాలు" అన్నాడు నవ్వుతూ.

అందరూ లాలూను ప్రేమించేవారు. అందుకే అతనికి కాంట్రాక్ట్ పనులు సులువుగా వచ్చేవి.

నేను అప్పుడప్పుడు అతడిని చూసేవాడిని. తలకు గొడుగు ఉండేది. కూలీలతో రోడ్డు రిపేరు పనులు చేయిస్తుండేవాడు. మమ్మల్ని ఎగతాళి చేస్తూ అనేవాడు "పరిగెత్తండి, పరిగెత్తండి. మీ పర్సెంటేజీలిప్పుడు కాన్సిలవుతాయి!"

చాలాకాలం క్రితం.. మేమప్పుడు పిల్లలం. బెంగాల్ స్కూల్లో చదివాం. అతను అందరికీ ఓ మెకానిక్! అతని స్కూల్ బ్యాగ్‌లో రకరకాల పరికరాలు ఉండేవి. నెయిల్ కట్టర్, విరిగిన కత్తి, రంధ్రాలు వేసే పరికరం, వగైరాలు. వాటిని ఎక్కడి నుండి తెచ్చేవాడో తెలియదు కానీ, వాటితో అతను చేయని పనంటూ లేదు. తన తరగతి వాళ్ళకు అతడెన్నో చేసేవాడు. పలక చెక్కల్ని బిగించేవాడు, ఆడుకునేప్పుడు చినిగిన బట్టల్ని కుట్టేవాడు. విరిగిన గొడుగుల్ని బాగుచేసేవాడు.. ఇలా ఎన్నో. అంతేకాదు.. లాలూ ఏ పనీ 'చేయన'ని అనేవాడు కాదు. ఏ పనైనా చక్కగా చేసేవాడు. ఓసారి పండుగనాడు రంగుల కాగితాలు, ఇతర సామగ్రి తెచ్చి వాటితో కొన్ని బొమ్మల్ని చేశాడు. తర్వాత వాటిని నది ఒడ్డుకు తీసుకుపోయి అమ్మాడు. ఆ డబ్బుతో మాకు కావాల్సినవి కొనిపెట్టాడు.

సంవత్సరాలు గడచిపోయాయి. మేం పెద్దవాళ్ళమయ్యాం. సాముగరిడీల్లో లాలూతో పోటీపడేవాళ్ళే లేరు. అతని శారీరక బలం, ధైర్యం.. రెండూ అనంతమే. ఎప్పుడైనా, ఎవరు పిలిచినా, ఎవరు యిబ్బందుల్లో ఉన్నా వెంటనే వచ్చేవాడు. ఆదుకునేవాడు, అతనిది గంభీరమైన స్వరం. అయితే ఎవరినైనా బెదిరించాలనుకున్నా, భయపెట్టాలనుకున్నా.. తనను తాను ఏమాత్రం అదుపు చేసుకోలేకపోయేవాడు. భయపెట్టాలనుకున్నప్పుడు అతనికి క్షణాల్లో కొత్త ఆలోచనలు వచ్చేవి. వాటిల్లో ఏ ఒక్కటీ మన ఊహకు అందవు. ఉదాహరణకు ఒకటి రెండు సంగ

www.Telugustory.co.cc

తుల్ని చెప్పనివ్వండి.

ఓ రోజు అర్థరాత్రి మనోహర ఛటర్జీ ఇంట్లో కాళీపూజ.. జరుగుతోంది. జంతు బలి ఇచ్చే సమయం దాటిపోతోంది. ఆ పని చేసే మనిషి ఇంకా రాలేదు. అతను విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడని తెలిసింది. అందరం కలవరపడ్డాం. అర్థరాత్రి బలి ఇచ్చే మరో మనిషిని ఎక్కడినుంచి తేగలం? ఆ కార్యక్రమం జరగకుంటే, పూజకు భంగం ఏర్పడుతుంది. మరి ఇప్పుడెలా?

అప్పుడు ఎవరో చెప్పారు "లాలూని పిలుద్దాం. అతను బలి కార్యక్రమం చేయగలడు, అదే పని ఇదివరకు ఎన్నోసార్లు చేశాడు"

వెంటనే మనుషులు లాలూ కోసం పరిగెత్తారు. అతను అప్పుడే నిద్రనుండి లేచి "రాను" అన్నాడు.

"ఎందుకు రానంటున్నావు? పూజకు ఆటంకమేర్పడితే ఎంతో అరిష్టం"

"కానీలే. అటువంటి బలులన్నీ చిన్నప్పుడు చేశాను. ఇప్పుడు చేయను" అన్నాడు లాలూ.

వచ్చినవాళ్లు తలకిందులయ్యారు. పూజా సమయానికి ఇంకా కొన్ని నిమిషాలు మాత్రమే ఉంది.

అప్పుడు లాలూ తండ్రి వచ్చి "తప్పని సరి పరిస్థితిలో వాళ్ళు నీ దగ్గరికొచ్చారు, కాదనడం మంచిది కాదు. పోయి రా" అన్నాడు. ఆ మాటను కాదనలేక పోయాడతను.


లాలూను చూస్తూనే ఛటర్జీ గాలి పీల్చుకున్నాడు. సమయం మించిపోతోంది. బలి కోసం తెచ్చిన గొర్రెపిల్లను గబగబా అలంకరించారు. నుదుట కుంకుమ దిద్దారు. మెడలో ఎర్రగన్నేరు పూలదండ వేశారు. బలిపీఠం దగ్గరికి దాన్ని తీసుకువచ్చారు. ఆ తర్వాత జనాల అరుపుల్లో.. నిస్సహాయంగా మారిన ఆ గొర్రెపిల్ల అరుపులు కలిసిపోయాయి.

లాలూ చేతిలోని గండ్రగొడ్డలి పైకి లేచింది. ఒకే వేటుతో గొర్రెపిల్ల తల నేల రాలింది. తెగిన మెడనుండి రక్తం ఎగజిమ్మింది. నల్లని నేల ఎర్రగా మారింది. కొన్ని క్షణాలు అతను కళ్లుమూసుకుని నిల్చుండిపోయాడు. క్రమంగా డ్రమ్ముల ధ్వనులు, జనాల అరుపులు తగ్గాయి.

మళ్లీ రెండో గొర్రెపిల్ల నుదుట కుంకుమ పూశారు. మెడలో ఎర్ర గన్నేరు పూలదండ వేశారు. మళ్ళీ డ్రమ్ముల మోతలు. జనాల అరుపుల మధ్య లాలూ ఆ నెత్తుటి గొడ్డలిని ఎత్తాడు. గొర్రెపిల్ల తల నేలమీద పడింది. మొండెం కొన్ని క్షణాలు కొట్టుకుంది. మళ్ళీ నేలంతా రక్తసిక్తమయ్యింది. డ్రమ్ముల శబ్దాలు తారస్థాయికి చేరాయి. జనం గుంపులుగా ఇళ్ల వరండాల ముందు నిల్చుని ఉన్నారు. ఛటర్జీ తివాచీమీద కళ్ళు మూసుకుని కూర్చుని ప్రార్థన సాగిస్తున్నాడు. అప్పుడు.. ఉన్నట్లుండి లాలూ గట్టిగా అరిచాడు! వెంటనే శబ్దాలన్నీ ఆగిపోయాయి. అతని తీరుకు అందరూ ఆశ్చర్యపోయారు. అతని కళ్లు విశాలంంగా, పెద్దగా మారాయి. కనుగుడ్లు తిరగసాగాయి. లాలూ గట్టిగా అరిచాడు "ఏవీ? మిగిలిన గొర్రెపిల్లలేవీ? "

ఎవరో బదులిచ్చారు "ఇంక గొర్రెలు లేవు. మేం సంవత్సరానికి రెండు మాత్రమే అర్పిస్తాం"

రక్తం బొట్లుబొట్లుగా పడుతుంటే ఆ గొడ్డలిని పైకెత్తాడు లాలూ! తల చుట్టూ రెండుమార్లు తిప్పి, ఆ వెంటనే మరింత బిగ్గరగా అరిచాడు "ఇంక గొర్రెపిల్లలు లేవా? లేకపోతే ఎలా? నేను వాటిని చంపాలి. ఇవ్వండి, గొర్రెపిల్లల్ని యివ్వండి. లేదంటే నేనే ఎవరో ఒకరిని పట్టుకుని నరుకుతాను. జై కాళీ" అంటూ అతనా గండ్రగొడ్డలిని తలపై తిప్పుతూ,


www.TeluguStory.co.cc

బలిపీఠానికి అటూ ఇటూ దూకసాగాడు.

అంతే.. అక్కడున్న వాళ్లంతా బయటి వాకిలివైపు పరిగెత్తడం మొదలుపెట్టారు. లాలూ వాళ్లని పట్టుకోబోయాడు కానీ, వాళ్లు తప్పించుకోసాగారు. కొందరు కిందపడ్డారు, ఇంకొందరు వేరేవాళ్ల కాళ్ల కింద దూరారు. మరికొంతమంది ఇంకొందరి గొంతుల్ని పట్టుకున్నారు. వాళ్లు ఊపి రాడక గిలగిలా కొట్టుకోసాగారు. ఇంకా కొంతమందైతే ఇతరుల భుజాలమీదకి ఎక్కసాగారు. దాంతో వాళ్లు నేలమీద దభాల్న పడిపోయారు. అంతా క్షణాల్లో

జరిగిపోయింది. లాలూ కంటికి ఇంకె వరూ కనిపించడంలేదు. "ఛటర్జీ ఎక్కడ? పూజచేసే మనిషెక్కడ? " అంటూ ఎలు గెత్తి అరిచాడు.

పూజ చేసే వ్యక్తి బక్క మనిషి. అతనే మొదటగా విగ్రహం వెనుక దాక్కున్నాడు! మంత్రాలు చదివే పెద్ద గురువు మండపం దగ్గరున్న పెద్ద స్తంభం వెనక దాక్కున్నాడు.

కానీ లావుగా ఉండే ఛటర్జీ పరిగెత్తలేక పోయాడు. లాలూ అతని చేతిని, మెడను దొరకబుచ్చుకున్నాడు. "నువ్వు రా! ఇప్పుడు బలిపీఠానికి వంతు నీదే" అన్నాడు.

చచ్చాననుకున్నాడు ఛటర్జీ. బతిమి లాడటం మొదలుపెట్టాడు "నాయనా.. లాలూ! నన్ను చూడయ్యా బాబూ! నేను గొర్రెను కాదు, మనిషిని. అందునా నీ పెదనాన్నను. అంటే మీ నాన్న నా తమ్ముడితో సమానం"

"నాకదంతా తెలియదు. నిన్ను చంపాలి. రా.. నిన్ను దేవికి అర్పించాలి. ఇది ఆమె ఆజ్ఞ!"

"కాదు నాయనా! దేవత ఆజ్ఞ కాదు" భోరున ఏడుస్తూ అన్నాడు ఛటర్జీ. "ఆమె అమ్మ.. ప్రపంచానికే అమ్మ"

"ప్రపంచానికే అమ్మ. అవును. కానీ, నీకా జ్ఞానముందా? మూగ ప్రాణుల్ని బలి ఇస్తావా? వాటిని చంపడానికి నాకు కబురు పంపిస్తావా? ఏమిటిదంతా? చెప్పు.. చెప్పవేం? "

కళ్ల నీళ్లు ధారగా కారుతుంటే అన్నాడు ఛటర్జీ "ఊహు.. మూగజీవాల్ని ఇంకెప్పు డూ బలి ఇవ్వను. దేవత ముందు ప్రమా ణం చేస్తున్నా. ఈరోజు నుండి ఇంకెప్పు డూ నా ఇంట్లో కూడా బలి ఇవ్వను"

"నిజమేనా? నమ్మమంటావా? "

"నేను చెప్పేది నిజం. నన్ను నమ్ము. ఇంక ఎప్పటికీ బలి ఇవ్వను. నాయనా! నా చేయి వదులు. నేను పోవాలి"

చేతిని వదులుతూ అన్నాడు లాలూ "సరే, పో. ఈ రోజుకు నిన్ను విడిచిపెడు తున్నా. ఆ పురోహితుడేడీ? తప్పించుకుపో యాడే? అసలా గురువేడీ? ఎక్కడ? "

అదే భయభ్రాంత వాతావరణంలో దేవత ప్రతిమ వైపు దూసుకుపోయాడు లాలూ! సరిగ్గా అప్పుడే ఆ స్తంభాల వెనక నుండి రెండు వేరు వేరు గొంతులు విని పించాయి! సన్నగా, పేలవంగా ఉన్న గొంతులవి! వాళ్లలా కంపించిపోవడం చూసి.. అంతటి స్థితిలోనూ ఫక్కున నవ్వే శాడు లాలూ. గండ్రగొడ్డల్ని అక్కడే పడేసి పరిగెత్తిపోయాడు.

కాసేపటి తర్వాత అందరికీ అర్థమైంది, లాలూ తమని ఆట పట్టించాడని! చంపు తాననడం, అందర్నీ భయపెట్టి పరిగెత్తిం చడం.. అంతా ఓ పథకమే అని!

పరిగెత్తిపోయిన వాళ్లందరూ తిరిగి గుమికూడారు. చేయాల్సిన పూజ ఇంకా మిగిలే ఉంది. ఇతర పనులకి ఇంకా మరికొంత సమయం పట్టేట్టుంది.

ఈ పరిస్థితిలో ఛటర్జీ సవాల్ చేశాడు "రేపు ఉదయంలోగా వాడ్ని వాడి నాన్నతో యాభై తన్నులు తన్నించకపోతే, నేను ఛటర్జీనే కాను"

కానీ లాలూకి ఏ 'శిక్షా' పడలేదు! ఉద యమే తప్పించుకుపోయాడు. ఏడెనిమిది రోజులు పత్తా లేడు. అతడిని ఎవరూ కని పెట్టలేకపోయారు.

ఆ తర్వాత ఓ సాయంత్రం అతనే చాటుమాటుగా ఛటర్జీ ఇంట్లోకి ప్రవేశించాడు. ఛటర్జీ కాళ్లు పట్టుకుని 'క్షమించ'మని వేడుకున్నాడు.

లాలూ తండ్రి కోపం కూడా తగ్గింది.

ఏదిఏమైనా, ఛటర్జీ.. దేవతముందే ప్రమాణం చేయడంతో, కాళీపూజకు గొర్రెల్ని బలిచ్చే సంప్రదాయం ఆ కుటుం బంలో శాశ్వతంగా ఆగిపోయింది. V